ఉజ్వల భవితకు.. కోర్సు ఎంపికే కీలకం!

- విద్యార్థుల్లో 'పది' తర్వాత ఏం చేయాలన్న సందిగ్ధత
- ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి
- బంగారు భవిష్యత్‌కు కోర్సు, గ్రూపుల ఎంపికే ప్రధానం
- విద్యార్థుల ఆసక్తి, విద్యాసామర్థ్యాల ఆధారంగా నిర్ణయం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శనం తప్పనిసరి


పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

రామభద్రపురం: పదో తరగతి తర్వాత ఏం చేయాలన్న ఆలోచన చాలామంది విద్యార్థుల్లో ఉంది. ఇంటర్మీడియట్ చదవాలా లేకపోతే ఐటీఐ చేయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఉజ్వల భవిష్యత్‌కు ఏ కోర్సు తీస్తే బాగుంటుందని ఆరాతీస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం తప్పనిసరి. ముఖ్యంగా విద్యార్థుల ఆసక్తి బట్టి వారిని ముందుకు నడిపించాల్సి ఉంటుంది. ఇంటర్ చదవాలనుకుంటే ఏ గ్రూపు తీస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయన్న విషయాలను తెలియజేయాలి. అలాగే ఐటీఐ, ఇతర కోర్సులేవైనా చేయాలనుకుంటే జీవితం ఎలా ఉంటుందో అవగాహన కల్పించాలి. ప్రస్తుతం పదో తరగతి ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో పదో తరగతి తర్వాత ఏం చేయాలనుకునే విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం..

23,939 మంది పరీక్ష రాశారు..

విజయనగరం జిల్లాలోని 447 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 22,939 మంది విద్యార్థులతో పాటు గతంలో టెన్త్ ఫెయిలైన మరో 835 మంది.. మొత్తంగా 23,774 మంది ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. బుధవారం ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఈ క్రమంలో వారు పాఠశాల విద్య తర్వాత ఏం చేస్తే బాగుంటుంది.. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు తీస్తే మంచిదన్న విషయాలను విద్యావిషయక నిపుణులు సూచిస్తున్నారు.

ఎంపీసీ..

ఇంజినీరింగ్ వృత్తిలో స్థిరపడాలనుకునే వారు తీసుకునే గ్రూపు ఎంపీసీ. రాష్ట్రంలో ఎంసెట్ రాయాలనుకునే వారు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరో నాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి ఈ గ్రూపు పునాది వంటిది. బిట్స్‌పిలానీలో ప్రవేశానికి జరిగే బిట్శాట్ రాసేందుకు ఎంపీసీ విద్యార్థులే అర్హులు. అలాగే ఇంజినీరింగ్ కోర్సు పూర్తయిన తర్వాత సివిల్స్, బ్యాంకు టెస్టులు వంటి ఉద్యోగాల రాత పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది.

బైపీసీ..

వైద్య సంబంధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునే వారు బైపీసీ వైపు దృష్టి సారించాలి. అగ్రికల్చర్ గ్రూపులకు ఈ గ్రూపు ప్రాతిపదిక. ఓపిగ్గా చదవడం, స్పష్టంగా బొమ్మలు గీయగలగడం ఈ గ్రూపు విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు.

ఎంఈసీ, సీఈసీ..

సైన్స్ ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేని వారు, సేవారంగం వైపు వెళ్లేవారు ఎంఈసీ లేదా కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులున్న సీఈసీ గ్రూపులో చేరవచ్చు. అలాగే చార్టర్డ్ అకౌంటెంట్, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంకు మేనేజర్ వంటి ఉద్యోగాల్లో స్థిరపడాలనుకున్నా, స్టాక్ మార్కెట్‌లో పట్టు, ఉద్యోగాలు సాధించాలన్నా ఈ గ్రూపు తీసుకోవడం మంచిది.

ఐటీఐ..

ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ) కోర్సును ఎంచుకోవడం ద్వారా విద్యార్థి పదో తరగతి తర్వాత రెండేళ్ల పాటు సాంకేతిక విద్యలో నైపుణ్యం పొందవచ్చు. తద్వారా జరిగే జాబ్‌మేళాలు, మంచి కంపెనీలను ఆశ్రయించి చిన్న వయసులోనే ఉద్యోగం పొందవచ్చు. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నత స్థాయి విద్యా కోర్సులు చేయవచ్చు.

పాలిటెక్నిక్..

పదో తరగతి తర్వాత ఏదైనా సాంకేతిక విద్యనభ్యసించి ఉపాధి పొందాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్. దీనికోసం విద్యార్థులు పాలిసెట్(పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఒకరి గ్రూపును చూసి ఎంచుకోవద్దు..



బాగా ఆలోచించి గ్రూపు ఎంచుకోవాలి. ఒకరు ఆ గ్రూపు తీశారు.. నేను అదే గ్రూపు తీస్తానని ఎప్పుడూ అనుకోవద్దు. మనకున్న శక్తిసామర్థ్యాలు బట్టి కోర్సు, అందులోని గ్రూపు ఎంపిక చేసుకోవాలి. ఒకరిని అనుకరిస్తే నష్టపోయే ప్రమాదం ఉంది. దేనిపై ఆసక్తి ఉందో.. ఏది మనం చదవగలమో.. దేనిలో మనం రాణించగలమో అదే చదువు చదవాలి. అప్పుడే మనం అనుకున్నది సాధించగలం.

– తాన్న కృష్ణ, ఉపాధ్యాయుడు, రామభద్రపురం

కంగారుపడి నిర్ణయాలు తీసుకోవద్దు..



కంగారుపడి నిర్ణయాలు తీసుకోవద్దు. ఫలితాలు వచ్చిన తర్వాత ఏ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు వచ్చాయి.. నిజంగా ఆ సబ్జెక్టులో మనకు ఆసక్తి ఉందా.. దానికి సంబంధించి కోర్సు గానీ గ్రూపు తీసుకోవడం మంచిది. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా తల్లిదండ్రులకు ఇష్టమనో.. లేకపోతే ఇంట్లో వారు ఈ గ్రూపు తీయాలని చెప్పారనో తీయొద్దు. భవిష్యత్ బాగుండే చదువు చదవాలి.

– నాగభూషణరావు, ఉపాధ్యాయుడు

ఇష్టమైన కోర్సు ఎంచుకోవాలి



ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ ఇలా విద్యార్థికి ఇష్టమైన కోర్సు ఎంచుకోవాలి. స్నేహితుడు చెప్పాడనో.. ఇంకెవరో చెప్పారనో ముందూ వెనకా ఆలోచించకుండా కోర్సులో జాయిన్ అవ్వకూడదు. మన విద్యాసామర్థ్యం బట్టి మనకు ఏ చదువు అయితే సరిపడుతుందో అదే ఎంచుకోవాలి.. అదే చదవాలి.

– గంట శ్రీరాములునాయుడు, అధ్యాపకురాలు

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు


కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు, తదితరులు

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ మంగళవారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రేగి రాంబాబు, సిబ్బంది అంతా కలిసి అక్కడ విక్రయించిన కూరగాయలు, ఆకుకూరలను కొనుగోలు చేసి, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించే పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ప్రతిఒక్కరూ ప్రకృతి సాగు పంటలనే ఆహారంగా వాడాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ తులసి, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లు చూపిస్తున్న అధికారులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇంటి అవసరాల నిమిత్తం వినియోగించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు హోటళ్లకు సరఫరా అవుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు వెలమ వీధిలోని డాల్ఫిన్ హోటల్‌లో అధికారులు సోదాలు చేశారు. మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టు జంక్షన్ వద్ద జేసీ ఫిల్లింగ్ స్టేషన్‌కు వెళ్లి, పెట్రోలు, డీజిలు నాణ్యత, కొలతలు పరిశీలించారు. అంతా బాగానే ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనుంచి హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో తరచూ తనిఖీలు చేస్తామని తహసీల్దారు ఎం.శ్రీను తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన


ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని నాయుడుకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎవరైనా పశువులను అనవసరంగా రోడ్ల పైకి వదిలేస్తే ఆ పశు యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని, లేదంటే జరిమానా విధించాలని తెలిపారు. అనంతరం పలుచోట్ల కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, మురుగు తొలగించారు.

దోమల నివారణకు ఫాగింగ్

రేగిడి: మండలంలోని సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల్లో దోమల నివారణకు మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందుతుండడంతో వాటి బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

వంగర: మండలంలోని కె.కొత్తవలస ప్రాథమిక పాఠశాలలో ఫేర్‌వెల్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను చదువు వైపు ప్రోత్సహించాలని, అలాంటప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీలో శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు, పూజలు, హోమాలు చేపట్టారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన గంజాయి

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం సమీపంలో తోటపల్లి కాలువ వద్ద మంగళవారం జరిపిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 1.126 కేజీల గంజాయి పట్టుకున్నామని ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. గడిముడిదాం గ్రామానికి చెందిన కలివరపు సురేష్‌కుమార్, వీరఘట్టం మండలం, కత్తులకవిటికి చెందిన కొత్తవలస లోకేష్‌లు అనుమానాస్పదంగా కాలువ వద్ద ఉన్నారు. వారి వద్ద తనిఖీ చేయడంతో వారి బ్యాగులో గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ప్రస్తుతం వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

'తోటపల్లి' భూముల పరిశీలన


భూ వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

తెర్లాం: తమ భూములు పోరంబోకు భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని వాటిని సరిచేయాలని ఇటీవల ఆమిటి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆ భూములను క్షేత్ర స్థాయిలో వెళ్లి, పరిశీలించారు. అనంతరం భూముల రైతులతో మాట్లాడారు. వారి భూములకు సంబంధించి ఏదైనా ఆధారాలుంటే చూపించాలని కోరారు. వారి వద్ద ఉన్న ఆధారాలను రెవెన్యూ రికార్డులతో పోల్చి చూశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ తోటపల్లి కాలువ నిర్మాణానికి చేపట్టిన భూసేకరణపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 166-12, 13, 29లు పోరంబోకు కాలువగా తప్పు పడ్డాయని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ జరిపామని, రైతుల వద్ద ఉన్న ఆధారాలు, తమ రికార్డులో ఉన్న వివరాలు పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట మండల సర్వేయరు సాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టు కేటాయింపులో తీవ్ర అన్యాయం


కలెక్టరుకు ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూపిస్తున్న బాధితురాలు సోనియాకుమారి

బొబ్బిలిరూరల్: అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు కేటాయింపులో తనకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటానికి సిద్ధమని మండలంలోని అలజంగి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం-1 ఆయా యర్రారపు సోనియాకుమారి అన్నారు. ఇదే విషయమై ఆమె గ్రామంలోని తన ఇంటి వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ చేసి, ఆయాగా పని చేస్తున్నా తనకు కాదని ఓపెన్ టెన్త్ పాస్ అయిన ఓ బీసీ మహిళకు అంగన్‌వాడీ టీచర్ పోస్టు కట్టబెట్టారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి, నిబంధనలకు పాతరేస్తూ తనకు ఆ పోస్టు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎస్సీ మహిళను.. ఏమీ చేయలేను.. తనకు ఎవరూ మద్దతు ఇవ్వరనే ఆలోచనతోనే అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు తనకు పోస్టు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కలెక్టరును కలిసి తన సమస్య చెప్పుకున్నా ఫలితం లేదని వాపోయారు. దీనిపై ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మిని వివరణ కోరగా, నిబంధనల మేరకే అక్కడి ఆయాకే పదోన్నతిపై కార్యకర్తగా నియమించడం జరిగిందన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఏవీ లేవన్నారు.

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


తెర్లాం: జగన్నాధవలస పాఠశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేసిన ఎంఈవో త్రినాధరావు


వంగర: కొప్పరలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేరాలని పిలుపునిస్తూ అవగాహన ర్యాలీ



రాజాంసిటీ: పొనుగుటివలసలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేస్తూ ఉపాధ్యాయులు గ్రామాల బాటపట్టారు. గ్రామ గ్రామానికి మంగళవారం వెళ్లిన వారు తొలుత అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల వయసు ఉన్న చిన్నారుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం మిగతా వారికి ఇంటికి వెళ్లి, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్యనందివ్వడం జరుగుతోందని, పిల్లలను చేర్పించాలనుకుంటే ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని అభ్యర్థించారు. అలాగే బడిలో చేరుతున్నట్లు ముందుకు వచ్చిన పలువురు చిన్నారులకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు.

– తెర్లాం, వంగర, రాజాంసిటీ

పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే ఇళ్లు మంజూరు


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ మురళీమోహనరావు

రామభద్రపురం: ఇంటి స్థలం ఉండి ఆ స్థలానికి సంబంధించి రెవెన్యూ అధికారులు ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే ఇళ్లు, నిధులు మంజూరు చేయడం జరుగుతుందని హౌసింగ్ పీడీ జి.మురళీమోహనరావు అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. జిల్లా వ్యాప్తంగా స్థలం ఉండి ఇళ్లు మంజూరు కోసం 34,719 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో ఇళ్లు మంజూరైన తర్వాత పొజిషన్ సర్టిఫికెట్ అడిగే వాళ్లమని ఇప్పుడు అలా కాకుండా ముందుగా పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే ఇళ్లు మంజూరవుతాయన్నారు. అర్బన్, రూరల్ అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల వారికి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.80 లక్షల నిధులు మంజూరవుతాయన్నారు. 2014-19 నాటి ఎన్టీఆర్ గృహ పథకం ఇళ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మే 17వ తేదీలోగా నిధులు పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ జీవీ రంగారావు, డీఈ ఎం.సత్యనారాయణ, ఏఈఈ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం సమావేశమై, ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేపడుతున్నారని, వేతనదారులకు వేతనం ఎలా గిట్టుబాటు అవుతుందని, కొలతల ప్రకారం పనులు చేయిస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరాతీశారు. సక్రమంగా పనులు చేయించాలని, రోజుకు రూ.307 వేతనం వచ్చేలా చూడాలని ఎంపీడీవో తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ కోసం వెళ్లాం..

సాక్షి ఎఫెక్ట్...

బొబ్బిలి: 'ఆర్డీవో కార్యాలయంలోనే అధికారులంతా' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. అలా ఉండడానికి గల కారణాన్ని తెలియజేశారు. ఇటీవల గాలివాన సృష్టించిన బీభత్సానికి ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లోని కంప్యూటర్లు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని బాగుచేసే సిబ్బంది కూడా సమ్మెలో ఉండడం, ఇంతలోనే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకావాల్సి ఉండడంతో ఆర్డీవో కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ వద్దకు చేరామని తహసీల్దారు ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

నియామకపత్రాలు అందజేత

బొబ్బిలి: రేషన్‌షాపు డీలర్లుగా నియమితులైన వారికి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. బొబ్బిలి డివిజన్ పరిధిలోని మొత్తం 20 డీలర్ల ఖాళీలను భర్తీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు, తహసీల్దారు ఎం.శ్రీను, సీఎస్‌డీటీ రెడ్డిసాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీవోగా విజయలక్ష్మి

రాజాం: మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏపీవో సాయిరాం బాడంగి మండలానికి బదిలీ కాగా అక్కడి ఏపీఎం విజయలక్ష్మి ఇక్కడికి వచ్చినట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సంతకవిటి: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ హెచ్ ఉపేంద్రరావు సూచించారు. మండలంలోని బొద్దూరులో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత అంతా సన్మార్గంలో నడవాలన్నారు.

ఏకపక్ష నిర్ణయాలు తగదు

బాడంగి: ఉన్నత పాఠశాలలో పీఎంసీ(పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ) సమావేశం మంగళవారం నిర్వహించారు. పీఎం శ్రీహైస్కూల్‌కు ఎంత నిధులు వస్తున్నాయి..ఎంత మేర ఖర్చు చేశారన్న విషయాలు చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదని పీఎంసీ సభ్యుడు జి.శ్రీను హెచ్ఎం సత్యనారాయణను నిలదీశారు. స్కూల్‌లో జరిగే కార్యక్రమాల గూర్చి కనీసం సర్పంచ్‌కైనా తెలియజేస్తున్నారా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు తప్ప దేనికీ ఆహ్వానించడం లేదని సర్పంచ్ రమేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

విశాఖ, విజయనగరానికి బస్సులు వేయండి



తెర్లాం మండల కేంద్రం నుంచి విశాఖపట్నం, విజయనగరం వెళ్లేందుకు బస్సు సర్వీసులు కల్పించాలని సర్పంచ్ బి.రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు కోరారు. ఇదే విషయమై వారు బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయనను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా తెర్లాం నుంచి నేరుగా విజయనగరం వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదని, విజయనగరం వెళ్లాలంటే రాజాం గానీ, రామభద్రపురం గానీ వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అలాగే గతంలో విశాఖపట్నం వెళ్లేందుకు తెర్లాం నుంచి ఎస్.కోట డిపో బస్సు ఉండేదని, ఇటీవల ఆ బస్సును రద్దు చేశారని చెప్పారు. విశాఖ, విజయనగరానికి వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం పల్లె వెలుగు బస్సు అయినా వేయాలని విజ్ఞప్తి చేశారు. – తెర్లాం

నిరుపయోగంగా మ్యాంగో రైపెనింగ్ సెంటర్



రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మ్యాంగో రైపెనింగ్ సెంటర్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. మామిడి రైతు నష్టపోకుండా ఉండేందుకు ఈ రైపెనింగ్ సెంటర్ల ద్వారా మామిడికాయలు మగ్గబెట్టి పండ్లు చేస్తారు. ఆ తర్వాత వాటిని రైతులు చక్కగా అమ్ముకోవచ్చు. ఇలాంటి సెంటర్ ఉపయోగాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో మూలకు చేరింది. పనికిరాకుండా పోయిన ఈ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. – రాజాం

రోడ్డుపైనే మురుగు..



రేగిడి మండలం, తునివాడ గ్రామ కొత్తపేట వీధిలో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోతోంది. ప్రధాన వీధిలోని వాడుకనీరంతా దిగువకు రాకుండా ఒకరిద్దరు అడ్డుగా గట్టులు వేయడంతో ఆ నీరంతా రోడ్డు మీదనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిరోజులుగా నీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగి, కుడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, మురుగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– రేగిడి

ఆరోగ్యంపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు సూచించారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో విజయనగరం వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఉచిత మహిళా ఆరోగ్య వికాస్ మెడికల్ క్యాంపు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. మహిళల్లో సంక్రమిస్తున్న కేన్సర్, ఇతర వ్యాధులపై అవగాహన అవసరమన్నారు. రొమ్ము, గర్భసంచి వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. 70 మంది మహిళలు వైద్య తనిఖీలకు హాజరయ్యారని ఆరోగ్యవికాస్ కార్యకర్త నల్ల శకుంతల తెలిపారు.

రుణ మంజూరు కమిటీలో వారినే సభ్యులుగా ఉంచాలి

బొబ్బిలి: బీసీ, ఎస్సీ, ఎస్టీ రుణాల మంజూరుకు సంబంధించిన కమిటీల్లో ఆయా వర్గాల వారినే సభ్యులుగా ఉంచాలని మండల దళిత సంఘ నాయకుడు గర్బాపు రమేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రుణాలు మంజూరు చేసే కమిటీల్లో వేరే వ్యక్తులు ఉండడం వల్ల అర్హులకు రుణాలు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఏ వర్గపు రుణాలకు సంబంధించి ఆ వర్గపు వారే ఉంటే అర్హులకు కచ్చితంగా రుణం వస్తుందనే నమ్మకం ఉంటుందన్నారు. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదర్శనగర్‌లోని కోదండరామస్వామి ఆలయ ఆవరణలో యోగ సాధకులు, వికాస తరంగిణి సభ్యులు సంయుక్తంగా మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో పెరుగుతున్న మార్పుల దృష్ట్యా ఖాళీ ప్రదేశాలతో పాటు ఇంటి ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విప్లవంలా చేపట్టాలని కోరారు. అలాగే పాలిథిన్ సంచులకు బదులుగా గుడ్డసంచులు వాడాలన్నారు.